# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 08 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 3


## 10 నుంచి గ్రూప్ ఫలితాల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




తెలంగాణలో గ్రూప్ ఫలితాల ప్రకటన షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. గ్రూప్–1, 2, 3 ఫలితాలను ఈ నెల 10 నుండి 18 మధ్య ప్రకటించనున్నట్లు టీజీఎస్పీఎస్సీ తెలిపింది. టీజీఎస్పీఎస్సీ తాజా షెడ్యూల్ ప్రకారం.. మార్చి 10న గ్రూప్–1 ఫలితాలు విడుదల కానున్నాయి, అదే రోజున అభ్యర్థుల ప్రొవిజినల్ మార్కుల వివరాలు కూడా వెల్లడిస్తారు. ఆ తర్వాత, సంబంధిత అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుంది.

గ్రూప్–2 జనరల్ ర్యాంకింగ్ జాబితాను మార్చి 11న ప్రకటించనుంది టీజీఎస్పీఎస్సీ. గ్రూప్–3 జనరల్ ర్యాంకింగ్ జాబితాను మార్చి 14న ప్రకటిస్తుంది. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ తుది ఫలితాలు వరుసగా మార్చి 17, 19 తేదీలలో విడుదల చేయనుంది టీజీఎస్పీఎస్సీ కమిషన్.

# దక్షిణాదిపై ప్రతీకారానికే డీలిమిటేషన్

- అన్ని రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకోవాలి
- దేశంలో కులగణన ఎందుకు జరగకూడదు
- హిందీ నేర్చుకోవడమన్నది ఒక ఐచ్ఛికంగా మాత్రమే ఉండాలి
- బలవంతంగా రుద్దకూడదు.
- హైదరాబాద్ వేదికగా ఒలంపిక్ క్రీడలు నిర్వహించడానికి అవకాశం ఇవ్వాలని ప్రధానికి విజ్ఞప్తి చేశాం.
- 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శ్రీకారం
- తెలంగాణకు 7 లక్షల కోట్ల అప్పులున్నాయి.
- ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన.. కీలకమైన ఈ మూడింటి సమ్మిళితమైన విధానం కొనసాగించడమే తెలంగాణ మాడల్ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. హైదరాబాద్ పోటీ ఇప్పుడు దేశంలోని ముంబై, బెంగుళూరు, ఢిల్లీ నగరాలతో కాదని, న్యూయార్క్, సియోల్, టోక్యో వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ అని చెప్పారు.

ముఖ్యమంత్రి ఢిల్లీలో IndiaToday Conclave-25 లో పాల్గొన్నారు. ఈ వేదికపై ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ , ఇండియా టుడే ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ప్రీతి చౌదరి అడిగిన అనేక సమకాలీన అంశాలపై రేవంత్ రెడ్డి స్పష్టమైన సమాధానాలిచ్చారు. గుజరాత్ రాష్ట్రానిది టెస్ట్ మ్యాచ్ మాడల్ అయితే, తెలంగాణది ట్వంటీ ట్వంటీ మాడల్ అని ఒక ప్రశ్నకు సమాధానంగా అభివర్ణించారు. అనేక అంశాలపై అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానంగా..."30 వేల ఎకరాల్లో అంతర్జాతీయస్థాయి అత్యంత అద్భుతమైన ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. అందుకోసం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశాం. అయిదు సంవత్సరాల తర్వాత హైదరాబాద్ నగరాన్ని చూడండి. హైదరాబాద్ నగరాన్ని ముంబై, బెంగుళూరు, ఢిల్లీతో పోల్చుకోవడం లేదు. న్యూయార్క్, సియోల్, టోక్యో వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడుతున్నాం. తెలంగాణ మాడల్‌తో ఎవరూ పోటీ పడలేరు. హైదరాబాద్ అభివృద్ధి ఒక్కరోజులో సాధ్యమైంది కాదు. కుతుబ్ షాహీ కాలం నుంచి ఈ నగరానికి 450 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రభుత్వాలు మారినా, ముఖ్యమంత్రులు మారినా అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయి.

పెట్టుబడుల విషయంలో గుజరాత్ తరహాలోనే దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మిగతా రాష్ట్రాలకు కూడా రాయితీలు ప్రకటించాలి. రాష్ట్ర ప్రజలు మాపై నమ్మకం ఉంచినందున రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై అడగటం మా బాధ్యత. తెలంగాణకు 7 లక్షల కోట్ల అప్పులున్నాయి. 2014 ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కేవలం 69 కోట్లు మాత్రమే అప్పులుండేవి. ప్రస్తుతం తెలంగాణ ఆదాయం నెలకు 18,500 కోట్లు మాత్రమే. జీతాలకు, అప్పులపై అసలు వడ్డీలకే 13 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం కనీసం నెలకు 500 కోట్లు కేటాయించలేని పరిస్థితులున్నాయి. ఇలాంటి అంశాలపై జాతీయస్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

2026 లో డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టడానికి ముందు అన్ని రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకోవాలి. దీనిపై ముందు చర్చ జరగాలి. రాజకీయ కోణంలో దక్షిణాదికి నష్టం జరిగే నిర్ణయాలు సరికాదు. దేశంలో కులగణన ఎందుకు జరగకూడదు. అందులో తప్పేముంది. బీసీల జనాభాను ఎందుకు లెక్కించకూడదు. ఎస్సీ, ఎస్టీ లెక్కలు తేల్చినట్టుగానే బీసీల గణాంకాలు సేకరించడంలో ఇబ్బందేంటి. వారి డిమాండ్ సమంజసమైనప్పుడు బీసీ జనాభా ప్రాతిపదికన వారికి రిజర్వేషన్లు కల్పించడంలో తప్పేముంది. ఎందుకు అడ్డుకోవాలని చూస్తున్నారు. ఓబీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వకూడదు.

హిందీ నేర్చుకోవడమన్నది ఒక ఐచ్ఛికంగా మాత్రమే ఉండాలి. బలవంతంగా రుద్దకూడదు. కాలేజీల్లో ఫ్రెంచ్, జర్మనీ వంటి ఎన్నో భాషలు ఉన్నాయి. ఎవరికి ఏదిష్టముంటే దాన్ని నేర్చుకుంటారు. హిందీని నేర్చుకోవడాన్ని వ్యతిరేకించడం లేదు. బలవంతంగా రుద్దడానికి ప్రయత్నించవద్దనేదే మా అభిప్రాయం. హిందీ నేర్చుకోవడం వల్ల ప్రయోజనం ఉందంటే నేర్చుకుంటారు.

హైదరాబాద్ వేదికగా ఒలంపిక్ క్రీడలు నిర్వహించడానికి అవకాశం ఇవ్వాలని ప్రధానమంత్రి మోదీ గారికి విజ్ఞప్తి చేశాం. క్రీడలకు హైదరాబాద్ ఒక మంచి కేంద్రం. ప్రపంచ మిలటరీ గేమ్స్, నేషనల్ గేమ్స్, ఏషియన్ గేమ్స్ హైదరాబాద్‌లో నిర్వహించాం. ఎంతో మంది ప్రపంచ స్థాయి క్రీడాకారులు తెలంగాణ నుంచి ఉన్నారు. హైదరాబాద్, అహ్మదాబాద్‌లలో ఏది ఉత్తమమైన నగరమో అంతర్జాతీయ ఒలింపిక్ అసోషియేషన్ నిర్ణయించాలి." అని ముఖ్యమంత్రి అన్నారు.



## ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ

- తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించేలా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు.
- వరంగల్ లో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ.
- తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు కంకణ బద్ధులమై మరింతగా పోరాడుదాం
- బీఆర్ఎస్ తెలంగాణ సమాజ రాజకీయ అస్తిత్వ పార్టీ.
- తెలంగాణ ప్రజల గుండెల్లో నెలవైన తెలంగాణ పార్టీ.
- తెలంగాణ కు రక్షణ కవచం బీఆర్ఎస్
- రజతోత్సవ వేడుకల్లో తెలంగాణ సమాజమంతా భాగస్వాములే
- తెలంగాణ సమాజం గర్వించేలా వేడుకలు
- బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను మొదటినుండి కాపాడుకుంటూ వస్తున్న బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ సమాజానికి రాజకీయ రక్షణను, పాలనా పరిరక్షణను అందించగలదని, ఈ విషయం గత పద్నాలుగు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ద్వారా మరోసారి స్పష్టమైందని, అందుకు తెలంగాణ సమాజంలో రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి అనిశ్చితే నిదర్శనమని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పునరుద్ఘాటించారు.

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 27 ఏప్రిల్ తేదీకి 25 ఏండ్లు కావొస్తున్న నేపథ్యంలో నిర్వహించే రజతోత్సవ వేడుకల్లో భాగంగా.. వరంగల్ జిల్లాలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఈమేరకు వరంగల్ సమీపంలో విశాలమైన అనువైన ప్రదేశాలను పరిశీలించి త్వరలో సభా వేదిక స్థలాన్ని నిర్ణయించనున్నట్టు కేసీఆర్ గారు తెలిపారు. ఈ మేరకు ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం నాడు జరిగిన కీలక సమావేశంలో ఇందుకు సంబంధించి సుదీర్ఘ చర్చ జరిగింది.

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు పోరాటాలు నడిపి ఎన్నో త్యాగాలతో తెలంగాణను సాధించుకున్నామని, అనంతరం పదేండ్ల పాటు ఎంతో అప్రమత్తతో స్వరాష్ట్రంలో పాలనను దేశానికే ఆదర్శంగా నిలుపుకున్నామని, అంతటి గొప్ప ప్రగతిని సాధించిన తెలంగాణ సమాజం ఇవ్వాళ కష్టాల్లో వుందన్నారు. ఇటువంటి సందర్భంలో నిర్వహించుకుంటున్న రజతోత్సవ వేడుకలు, కేవలం బీఆర్ఎస్ పార్టీకే పరిమితం కాదని యావత్ తెలంగాణ సమాజానికి అందులో భాగస్వామ్యం వుందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలు నిర్మించుకున్న రాజకీయ అస్థిత్వ పార్టీ. ఇది తెలంగాణ ప్రజల పార్టీ.. ప్రజలు బీఆర్ఎస్ ను తెలంగాణ పార్టీగా తమ సొంత ఇంటి పార్టీగా భావిస్తారు. ప్రజలు ఇవ్వాళ అనేక కష్టాల్లో వున్నారు. వారి రక్షణ బీఆర్ఎస్ పార్టీనే అని నమ్ముతున్నారు అని తెలిపారు. కాంగ్రెస్ ఆశపెట్టిన గ్యారెంటీలను వాగ్దానాలను నమ్మిన ప్రజలు ఇవ్వాళ రాష్ట్ర ప్రభుత్వ నిజ స్వరూపాన్ని తెలుసుకున్నారని, ఇక ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ కు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని కేసీఆర్ అన్నారు.

ఈ సందర్భంగా వరంగల్ లో నిర్వహించే భారీ బహిరంగ సభకు లక్షలాదిగా ప్రజలు తరలివస్తారని సమావేశంలో ఆశాభావం వ్యక్తమైంది. కాగా.. బహిరంగ సభ సన్నాహక సమావేశాలను నియోజక వర్గాల వారీగా నిర్వహించాలని అందుకు త్వరలో కమిటీలను వేయనున్నట్టు కేసీఆర్ గారు తెలిపారు. వరంగల్ బహిరంగ సభ అనంతరం.. పార్టీనీ గ్రామ స్థాయినుంచి రాష్ట్రస్థాయి వరకు సంస్థాగతంగా పటిష్ట పరిచి, ఆ దిశగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తర్వాత నూతన కమిటీల బాధ్యులతో ప్రతినిధుల సభను ఏర్పాటు చేయనున్నట్టు అధినేత తెలిపారు. పార్టీలో యువత, మహిళా భాగస్వామ్యం పెంచాలని నిర్ణయం తీసుకున్నారు.

రాష్ట్రంతో పాటు, దేశంలో మిగతా 2వ పేజీలో

## వచ్చేవారం నుంచి ఇందిరమ్మ ఇళ్లు

**నియోజవర్గానికి 3500 కేటాయింపు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**బలగం టీవీ, ఖమ్మం**



రాష్ట్ర వ్యాప్తంగా వచ్చేవారం నుంచి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటీ శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ.. పేదవారి ప్రభుత్వం కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని ఈ రోజుతో 15 నెలలు అయిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థంగా తయారైందని, అయినా తెలంగాణ ప్రజానీకానికి ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. అర్హులైన వారికి అందరికీ రేషన్ కార్డులు ఇస్తామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేని కారణంగా తులం బంగారం ఆలస్యమవుతుందని అన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లు కేటాయించినట్లు మంత్రి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మిగతా 2వ పేజీలో

## 11న మారిషస్‌కి ప్రధాని మోడీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**



భారత ప్రధాని నరేంద్ర మోడీ రెండు రోజుల పర్యటనపై మార్చి 11న మారిషస్ వెళ్లబోతున్నారు. ఆ దేశ జాతీయ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొనబోతున్నారు. మారిషస్ జాతీయ దినోత్సవంలో భారత రక్షణ బలగాల దళం కూడా పాల్గొనబోతున్నదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. ప్రధాని మోడీ మార్చి 11,12 తేదీల్లో మారిషస్ పర్యటించనున్నారు. మారిషస్ జాతీయ దినోత్సవం మార్చి 12న జరుగనున్నది. ఈ సందర్భంగా భారత నౌకాదళం ఓడ కూడా మారిషస్‌కు వెళ్లబోతున్నది. మారిషస్ రాజధాని పోర్ట్ లూయిస్‌లో మోడీ మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్‌తో భేటీ అవుతారు. అలాగే మారిషస్‌లోని ప్రతిపక్ష నాయకుడు రామ్ గులాంతో కూడా విస్తృతస్థాయిలో చర్చలు జరుపుతారు. మారిషస్‌తో భారత్‌కు చిరకాల సంబంధాలున్నాయి. మారిషస్ జనాభా 12 లక్షలు. అందులో భారతీయ సంతతికి చెందిన వారే 70 శాతం మంది ఉంటారు. 2005 నుంచి మారిషస్ ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఇండియా కొనసాగుతున్నది. రెండు దేశాల మధ్య 554 మిలియన్ల డాలర్ల మేరకు వాణిజ్యం జరుగుతోంది. గత 17 ఏళ్లలో రెండు దేశాల మధ్య వాణిజ్యం 132 శాతం మేరకు పెరిగింది.

## సచివాలయంలో కాంట్రాక్టర్ల మెరుపు ధర్నా

- **పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరసన**
- **డిప్యూటీ సీఎం కోసం సెక్రెటేరియట్‌కు వచ్చిన 200 మంది కాంట్రాక్టర్లు**
- **సిబ్బంది అనుమతించపోవడంతో ఆందోళన**
- **భట్టి విక్రమార్క ఛాంబర్ ముందు బైఠాయింపు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




రాష్ట్ర సచివాలయంలో కొందరు కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగారు. ఆర్థిక శాఖ మంత్రిభట్టి విక్రమార్క చాంబర్ ముందు వీరు ఆందోళన చేశారు. శు క్రవారం వివిధ జిల్లాల నుంచి దాదాపు 200 మంది కాంట్రాక ర్లు సచివాలయానికి వచ్చారు. డిప్యూటీ సీఎంని కలిసేందుకు తాము వచ్చామని చెప్పి భట్టి విక్రమార్క చాంబర్ వద్దకు వెళ్లారు. అయితే భట్టివి క్రమార్క అప్పటికే వెళ్లిపోయారు. దీంతో ఎస్పీఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది వెళ్లిపోవాల ని సూచించారు. కానీ వారు వెళ్లకుండా ఆందోళనకు దిగారు. బిల్లులు క్లియర్ కావాలంటే కనీసం 20 శాతంకమిషన్ అనుగుతున్నట్లు కాంట్రాక్టరు ఆరోపించా రు. గత బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో పనులు చేశామని, అయితే బిల్లులు మూ దేళ్లగా పెండింగ్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తమ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాల ని వారు డిమాండ్ చేశారు. మూడేళ్లుగా తను బిల్లులు పెండింగ్లో ఉండటంతో వడ్డీలు భారం పెరిగిపోయిందని, ప్రస్తుతం వడ్డీలను కట్టలేని స్థితికి తాముదిగజారిపో యామని కాంట్రాక్టర్లు ఆవేదన చెందారు. ప్రభుత్వం నుంచి ఎప్పుడూ నిధులు లేవనే సమాధానమే వస్తోందని కానీబరా కాం ట్రాక్టర్లకు మాతం బిల్లులు ఇచ్చేందుకు ప్రభుత్వం వద్ద డబ్బులు ఉన్నాయా అని వారు నిలదీశారు.

కాంట్రాక్టర్ల ఆందోళన వెనుక ఎవరున్నా రని విషయంపై ప్రభుత్వం ఆరా తీస్తున్నదని తెలుస్తోంది. కాంట్రాక్టర్లను సచివాలయం లోపలికి ఎవరు రానిచ్చారు? వారిలో ఎంతమంది. నిజమైన కాంట్రాక్టర్లు ఉన్నారు? కేవలం సోషల్ మీడియాలో ప్రచారం కోసమే ఇలా ప్రవర్తించారా? అనే అంశాలపై లోతుగా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. తప్పుడు బిల్లులు పెట్టి అవినీతికి పాల్ప దీన వారి బిల్లులు మాత్రమే పెండింగ్లో ఉంటాయని, వారు తమ బిల్లులు రాబెట్టు కునేందుకు ఈరకమైన ఒత్తిడి చేసి బ్లాక్ మెయిలింగ్కు పాల్పడుతున్నారని అను మానిస్తున్నారు మరోపక్క కాంట్రాక్టరు అందరూ ఒక పథకం ప్రకారం ప్రభుత్వా న్ని బద్నామ్ చేయడానికి వచ్చిన వారేనని. వారంతా బీఆర్ఎస్ సాను భూతి పరులని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. గత కొద్దిరోజులుగా డిప్యూటీ సీఎంభట్టి విక్రమార్కపై సోషల్ మీడియాలో పర్వం టేజీల పేరుతో దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

## మౌనం వీడండి

- రేవంత్ సహా బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు ఏపీ ప్రభుత్వ జల దోపిడీని అడ్డుకోండి
- కృష్ణా నీళ్ల తరలింపు కోసం ఏపీ ముఖ్యమంత్రి కుట్ర చేస్తుంటే ఎందుకు మౌనం?

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



"బనకచర్ల ద్వారా 200 టీఎంసిల కృష్ణా నీళ్ల తరలింపు కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర చేస్తుంటే రేవంత్ రెడ్డి మౌనం? బనకచర్ల ద్వారా గోదావరి వరద జలాలనే తీసుకువెళ్తున్నాం, తెలంగాణకు నష్టం లేదు అని ఏపీ నీళ్ల మంత్రి అంటే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ మౌనం? మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనం?" అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. "గోదావరి, కృష్ణా నీటిలో తెలంగాణ వాటాను ఏపీ ఇష్టారాజ్యంగా తరలలించే కుట్రలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఉత్తం కుమార్ రెడ్డి సహా ఒక్క నాయకుడికి పట్టింపు లేదు. "బనకచర్ల తో తెలంగాణకు ఏమి నష్టం" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా మాట్లాడి మూడు రోజులైనా ఒక్కరూ గట్టిగా స్పందించలేదు. తెలంగాణ నీటి ప్రయోజనాలు ఈ సర్కారుకు పట్టవా? అక్రమంగా నీటిని తరలించుకు పోతుంటే మొద్దు నిద్ర నటిస్తారా? చంద్రబాబును అడ్డుకునే ధైర్యం, కేంద్రాన్ని అడిగే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదా? చంద్రబాబుతో బీజేపీ, రేవంతు దోస్తీ చేస్తూ తెలంగాణను మోసం చేస్తారా?

బాబు, రేవంత్, బిజెపి మధ్య లోపాయికార ఒప్పందం ఏమిటి? బిఆర్ఎస్ పార్టీ గొంతెత్తినా మీకు చలనం కలగదా? కాంగ్రెస్, బిజెపి తీరు తెలంగాణ తాగు, సాగు నీటి రంగానికి గొడ్డలి పెట్టుగా మారుతున్నది. తెలంగాణ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పార్టీ పడుతున్న ఆరాటం మీకు ఎలాగూ అర్థం కాదు, కనీసం మీడియాలో వస్తున్న కథనాలను చూసైనా కదలండి. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వ జల దోపిడీని అడ్డుకోండి. కేంద్రాన్ని నిలదీయండి. రేవంత్ సహా బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనం వీడండి!

## కొత్త ఐటీ చట్టం వల్ల
# పౌరుల డిజిటల్ గోప్యతకు ప్రమాదం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఐటీ చట్టం వల్ల పౌరుల డిజిటల్ గోప్యతకు తీవ్రమైన ప్రమాదం ఏర్పడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. సోషల్ మీడియా, ఈమెయిల్స్, ఆన్‌లైన్ ట్రేడింగ్ ఖాతాలను పరిశీలించేందుకు ఐటీ అధికారులకు అనుమతివ్వటం పౌరుల గోప్యతకు భంగకరమని పేర్కొన్నారు. ఇది అధికార దుర్వినియోగం కింది దారితీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. పౌరుల ఆర్థిక సమాచారం ఇప్పటికే అనేక వేదికల్లో నిక్షిప్తమై ఉన్నదని, ఐటీ అధికారుల అక్రమ చొరబాటుకు అవకాశం కల్పించటం పౌరుల ప్రాథమిక హక్కులకు, డిజిటల్ గోప్యతకు భంగం కలిగించడమేనని విమర్శించారు. 'ఏదైనా దుర్వినియోగం జరిగితే ఎవరు జవాబుదారీగా నిలబడతారు? ప్రధాన మంత్రా? లేక కేంద్ర ఆర్థికమంత్రా?' అని నిలదీశారు.

కాంగ్రెస్ 15 నెలల పాలనలో అనేక రంగాలు ధ్వంసమయ్యాయని అన్నారు. అధికారం కోసం ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామన్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు ఆదాయం కోసం ఎల్ఆర్ఎస్ ముద్దు అంటున్నారని ఎద్దేవాచేశారు. హైడ్రా, ఆర్ఆర్ ట్యాక్స్ పేరితో హైదరాబాద్‌లో అరాచకం సృష్టిస్తున్నారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్ల కూలుస్తున్నారని, హైడ్రా, మూసీ చర్యల కారణంగా రిజిస్ట్రేషన్లు పడిపోయారని, ఆదాయం లేక ఖజానా ఖాళీ అయిందని మండి పడ్డారు. ఏడాది పాలనలో లక్షన్నర కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై మోపారని, 420 హామీలు మాత్రం అమలు కావడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నిర్వాకం మూలంగా రియల్టర్లు కూడా ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సరారు గారడీలో సామాన్యులే సమిధలవుతున్నారని, జాగో తెలంగాణ జాగో అని శుక్రవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కేన్స్ గుజరాత్‌కు వెళ్లింది. కార్నింగ్ తమిళనాడుకు వెళ్లింది. ఇప్పుడు సోలార్ ఉత్పత్తి చేసే కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ ఏపీకి వెళ్లిపోతున్నది. మల్టీ నేషనల్ కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలుతున్నాయి' అని వాపోయారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులను కూడా కాంగ్రెస్ పాలకులు పట్టుకోలేకపోతున్నరు. ఏం దురదృష్టం రాహుల్ గాంధీజీ' అని ఎక్స్‌వేదికగా ఎద్దేవా చేశారు.

'కొన్ని కథలు చాలా ప్రత్యేకంగా ఉంటా యి. కిటెక్స్ కంపెనీని తెలంగాణకు తెచ్చాం. రూ.3,000 కోట్ల కంటే ఎకువ పెట్టుబడులు పెట్టించాం. మా ప్రభుత్వంలో జరిగిన ప్రయత్నాలపై బిజినెస్ స్టాండర్డ్ పత్రిక ప్రత్యేక కథనం ప్రచురించింది. ఆ కథనాన్ని ఇచ్చిన బిజినెస్ స్టాండర్డ్‌కు ధన్యవాదాలు' అని కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

నల్లగొండలో రూ.1.66 కోట్లతో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన పట్టణ నిరాశ్రయుల వసతి కేంద్రం నిరుపయోగంగా ఉన్నదని, దాన్ని తిరిగి పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆ జిల్లా కలెక్టర్‌ను కేటీఆర్ కోరారు. జిల్లా ప్రభుత్వ దవాఖాన ప్రాంగణంలో నిర్మించిన ఈ కేంద్రాన్ని 2023 అక్టోబర్‌లోనే ప్రారంభించినట్టు తెలిపారు. ఓ నెటిజన్ ఈ సమస్యపై ట్వీట్‌చేయగా, కేటీఆర్ రీ ట్వీట్ చేశారు.

## పడవ బోల్తా.. 186 మంది గల్లంతు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

యెమెన్, జిబౌటి జలాల్లో ఆఫ్రికా నుంచి వలసదారులతో ప్రయాణిస్తున్న నాలుగు పడవలు రాత్రిపూట బోల్తా పడ్డాయని ఐక్యరాజ్యసమితి వలస సంస్థ శుక్రవారం తెలిపింది. కనీసం ఇద్దరు మరణించగా, 186 మంది గల్లంతయ్యారని వెల్లడించింది. యెమెన్ తీరంలో గురువారం రాత్రి రెండు పడవలు బోల్తా పడ్డాయని అంతర్జాతీయ వలస సంస్థ ప్రతినిధి తమీమ్ ఎలియన్ తెలిపారు. ఇద్దరు నౌకా సిబ్బందిని రక్షించగా, 181 మంది వలసదారులు, ఐదుగురు యెమెన్ సిబ్బంది కనిపించకుండా పోయారని ఆయన అసోసియేటెడ్ ప్రెస్‌కు తెలిపారు. అదే సమయంలో ఆఫ్రికాలోని జిబౌటి దేశం నుండి బయలుదేరిన మరి రెండు బోల్తా పడ్డాయని, వలసదారుల రెండు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు, పడవలోని మిగతా వారిని రక్షించినట్లు ఆయన తెలిపారు. దాదాపు దశాబ్ద కాలంగా అంతర్యుద్ధం కొనసాగుతున్నందున తూర్పు ఆఫ్రికా నుంచి వలస దారులు యెమెన్ మార్గం గుండా గల్ఫ్ దేశాలకు వెళ్లి పనిచేసుకుని బతకాలని ప్రాణాలకు సైతం తెగించి సాహసం చేస్తున్నారు. కానీ వారిలో కొందరికి ప్రమాదాలు తప్పడం లేదు. ప్రస్తుతం యెమెన్‌లో 380000 మంది వలసదారులు ఉన్నారు.

## ఏడు రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖ



- తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ డీలిమిటేషన్ వివాదంపై జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటుకు కసరత్తు చేపట్టారు. దీని కోసం ఏడు రాష్ట్రాల సీఎంలను చెన్నైకు ఆహ్వానించారు. దక్షిణాదిలోని కర్ణాటక, కేరళ, ఆంధ్రా, తెలంగాణాతో పాటు పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సీఎం స్టాలిన్ లేఖ రాశారు. డీలిమిటేషన్ కసరత్తుకు ప్రణాళిక కోసం జేఏసీ ఏర్పాటుకు పిలుపునిచ్చారు. కాగా, జేఏసీపై ఏకీకృత వ్యూహాన్ని సమన్వయం చేసేందుకు మిగతా 2వ పేజీలో

## ఐపీఎస్ అధికారుల బదిలీ

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో కొన్ని జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లకు స్థానచలనం కలిగింది. రాష్ట్ర ఎస్పీఎఫ్ డీజీ అనిల్ కుమార్‌ను రాష్ట్ర పోలీస్ పర్సనల్ అదనపు డీజీగా బదిలీ చేశారు. రామగుండం కమిషనర్ ఎం.శ్రీనివాసులును సీఐడీ ఐజీగా, వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను రామగుండం కమిషనర్‌గా, సూర్యాపేట్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌కు డీఐజీగా పదోన్నతి ఇచ్చి వరంగల్ సీపీగా నియమించారు.పెద్దపల్లి డీసీపీ చేతనను రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఎస్పీగా, కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ ఇంటెలిజెన్స్ విభాగానికి, యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్రను కామారెడ్డి ఎస్పీగా, నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయిచైతన్యను నిజామాబాద్ సీపీగా, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలంను కరీంనగర్ ఎస్పీగా నియమించి.. ఇక్కడనున్న అభిషేక్ మహంతిని ఆంధ్రప్రదేశ్‌కు రిలీవ్ చేశారు. రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహజన్‌ను అదిలాబాద్ ఎస్పీగా, సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా, నగర సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్‌ను యాదాద్రి డీసీపీగా, కొత్తగూడేం ఓఎస్డీ పంకజ్ పరితోష్‌ను సంగారెడ్డి ఎస్పీగా బదిలీ చేశారు. ములుగు ఓఎస్టీ మహేష్ బాబా సాహెబ్‌ను రాజన్న సిరిసిల్ల ఎస్పీగా, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అంకిత్ కుమార్ షేకావర్ వరంగల్ ఈస్ట్ డీసీపీగా, మరో ఎస్పీ ఏ.భాస్కర్‌ను మంచిర్యాల డీసీపీగా, మరో ఎస్పీ నరసింహను సూర్యాపేట ఎస్పీగా నియమించారు.పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న మరో ఎస్పీ శిల్పవల్లిని సెంట్రల్ జోన్ డీసీపీగా, మరో ఎస్పీ సాయిశేఖర్‌ను ఎస్ఐబీ ఎస్పీగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరో ఎస్పీ కరుణాకర్‌ను పెద్దపల్లి డీసీపీగా, పి.రవీందర్‌ను ఎస్పీ సీఐడీగా నియమించారు.



## మెట్రోలో మరోసారి గుండె తరలింపు

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ మెట్రో మరోసారి గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేసింది. అత్యవసర గుండె మార్పిడి కోసం హైదరాబాద్ మెట్రో రైలు ఈ ప్రత్యేక గ్రీన్ ఛానల్‌ను శుక్రవారం రాత్రి 9.16 గంటలకు ఏర్పాటు చేసింది. ఎల్బీ నగర్‌లోని కామినేని హాస్పిటల్స్ నుండి ఒక దాత గుండెను మెట్రో ద్వారా సికింద్రాబాద్‌లోని రసూల్‌పురా కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. రెండు ఆసుపత్రుల మధ్య దూరం 13 కిలోమీటరు. ట్రాఫిక్‌లో గుండెను రోడ్డుపైకి తీసుకెళ్లడానికి గంటకు పైగా పట్టవచ్చు. అయితే, వైద్య బృందం మెట్రోలో కేవలం 12 నిమిషాల్లో ఆ దూరాన్ని అధిగమించింది.

## ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి)

నడుస్తున్న వర్తమాన రాజకీయ పరిస్థితులపై అందుకనుగుణంగా పార్టీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహాలు అమలుచేయాల్సిన రాజకీయ ఎత్తుగడలపై లోతైన చర్చ జరిగింది. గత ఒడిదుడుకులను అనుభవాలను పరిగణలోకి తీసుకుని వాటిని విశ్లేషిస్తూ, వర్తమానానికి అన్వయించుకుంటూ భవిష్యత్తుకు బాటలు వేసుకునే విధంగా కార్యాచరణను అమలుపరచాలని సమావేశంలో నిర్ణయించారు.

కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వమున్నా కూడా, తెలంగాణ సమాజానికి మొదటినుంచి అవి వ్యతిరేకంగానే పని చేస్తున్నాయని సమావేశంలో ఆవేదన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేసుకొని దేశ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల పట్ల నిత్యం అప్రమత్తతతో వుండాలని సమావేశం భావించింది. తెలంగాణ ఇంటి పార్టీ ప్రాతినిధ్యం పార్లమెంటులో లేకపోవడం వలన తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లుతుందని అంశంపై చర్చ జరిగింది. ఇదే విషయాన్ని ప్రజలకు మరింతగా అర్థం చేయించి పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు ప్రాతినిధ్యం వుండి రాష్ట్ర హక్కులను కాపాడుకునే దిశగా ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. కాగా పలు అంశాలపై చర్చ సందర్భంగా అధినేత కేసీఆర్ అందరి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పాల్గొన్న నేతలు వారి వారి అభిప్రాయాలను అధినేత ముందుంచారు. దాదాపు ఎనిమిది గంటల పాటు సాగిన సుధీర్ఘ చర్చలో.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల వైఖరులను తిప్పి కొడుతూ తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని కేసీఆర్ అధ్యక్షతన సాగిన సమావేశం నిర్ణయించింది.

## ఏడు రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

ఏడు రాష్ట్రాలకు చెందిన పార్టీల నుంచి సీనియర్ ప్రతినిధులను ఆయా రాష్ట్రాలు నామినేట్ చేయాలని సీఎం స్టాలిన్ కోరారు. అలాగే డీలిమిటేషన్‌పై సమిష్టిగా చర్చించడానికి మార్చి 22న చెన్నైలో ప్రారంభ సమావేశం ఏర్పాటుకు ప్రతిపాదిం చారు. 'నాయకత్వం, సహకారాన్ని ప్రస్తుత పరిస్థితి కోరుతోంది. రాజకీయ విభేదాలకు అతీతంగా సమిష్టి మం చి కోసం మనం నిలబడాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు.మరోవైపు జనాభా నియంత్రణ చర్యలను విజయవంతంగా అమలు చేసి, మంచి పాలన కొనసాగించిన రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరుతో అన్యాయంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని సీఎం స్టాలిన్ ఆరోపించారు. జనాభా ప్రతిపాదికన లోక్‌సభ స్థానాల పునర్విభజన జరిగితే తమిళనాడు ఎనిమిది సీట్లు కోల్పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# మహిళా అభివృద్ధితోనే సమాజం ప్రగతి

**● మంత్రి సీతక్క**

**బలగం టీవి, హైదరాబాద్**




అని రంగాల్లో మహిళలకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. పెట్రోల్ పంపులు, ఆర్టీసీ అద్దె బస్సులను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. అదానీ అంబానీలకు ఫలితమైన సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అందిస్తున్నామని ఉద్ఘాటించారు. త్వరలో మరిన్ని వ్యాపారాల్లోకి మహిళా సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టామని తెలిపారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ(శుక్రవారం) యూసఫ్ గూడా లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో , స్మాల్, మీడియం ఎంటర్‌ప్రెజెస్ ప్రాంగణంలో మహిళా సాధికారత యాక్షన్ ప్లాన్ వర్క్ షాప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, విద్యార్థులు, సిబ్బంది, సెర్ప్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్, ఏపీఎంలు హాజరయ్యారు. ప్రగతికి చిహ్నంగా మొక్కలకు నీరు పోసి వర్క్ షాప్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు.

'అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు సమాన వేతనాలు ఉండాలన్న లక్ష్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.మహిళల కష్టానికి తగిన ఫలితం ఉండాలన్నదే మహిళా దినోత్సవ ఆవిర్భావానికి కారణంగా నిలిచింది. భూగర్భం నుంచి అంతరిక్ష రంగం వరకు అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు రావాలి. మహిళల కష్టానికి తగిన ఫలితం దక్కినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం. మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగిన వివక్షత కొనసాగుతూనే ఉంది. మహిళలు ఎమ్మెల్యేలు మంత్రులు ఐఏఎస్‌లు అయినా లైంగిక అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఒకప్పుడు మహిళలకు వ్యవసాయం, పరిశ్రమలు మాత్రమే ఉపాధి మార్గాలు.కానీ ఇప్పుడు ఎన్నో రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. అయినప్పటికీ మహిళల పట్ల సమాజంలో చిన్న చూపు పోవడం లేదు.ప్రతి రంగంలో మహిళల ప్రస్థానాన్ని, వారి స్థానాన్ని సమీక్షించాలి. లింగ సమానత్వం విషయంలో ఐక్యరాజ్యసమితి నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంత మేర మనం చేరుకోగలుగుతున్నామో ఆవలోకనం చేసుకోవాలి. మహిళలకు సమానత్వం, సమాన అవకాశాలు రావాలి. లింగ అంతరాలను తుంచితినే సమాజంలో సమానత్వం. శారీరకంగా మహిళలకు ఎన్నో ప్రతికూలతలు ఉన్నాయి.వాటన్నిటినీ అధిగమించి మహిళలు మందంజ వేస్తున్నారు. మహిళల ప్రతికూలతలను దృష్టిలో ఉంచుకొని విధానాల రూపకల్పన జరగాలి' అని మంత్రి సీతక్క తెలిపారు.

'ఆదిశలో ప్రజా ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. మహిళా అనుకూలంగా అత్యుత్తమ విధానాన్ని రూపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. అనుభవజ్ఞుల ంతా సలహాలు సూచనలు చేస్తే, అనుగుణంగా నూతన విధానాన్ని రూపొందిస్తాం. లింగ సమానత్వాన్ని సాధించడంలో మహిళా సంఘాల పాత్ర గణనీయంగా ఉంది. మహిళా సంఘాలు మహిళలకు ఆర్థిక రక్షణతో పాటు సామాజిక భద్రత కల్పిస్తున్నాయి. ఈ ఏడాది అనుకున్న లక్ష్యాలకు మించి మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించాం. రూ. 20వేల కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించుకుంటే.. రూ.22 వేల కోట్ల వరకు రుణ సౌకర్యం కల్పించాం. మహిళా తన కాళ్ల మీద తాను నిలబడాలి, రాజకీయ రంగంతోపాటు అన్ని రంగాల్లో బలమైన శక్తిగా ఎదగాలి.రాజ్యాలు సొంతగా పాలన చేసేలా మహిళలు ఎదగాలి. మహిళలే అసలు సిసలు ఆర్థిక శాస్త్రవేత్తలు. పుస్తకాల ఆర్థిక శాస్త్రవేత్తలు ఎందరో ఉంటారు.. కానీ ఆచరణలో, కుటుంబ నిర్వహణలో మహిళలే అత్యున్నత ఆర్థికవేత్తలు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అతివలు అపూర్వ విజయాలు సాధిస్తున్నారు. మహిళా అభివృద్ధితోనే సమాజం ప్రగతి సాధిస్తుంది. వచ్చే మహిళా దినోత్సవం లోపు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో రెండు మెట్లు ఎదిగేలా కృషిచేస్తాం" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## వచ్చేవారం నుంచి ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్లు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాపాలనలో అర్హులం దరికీ ఇళ్లు మంజూరవుతాయన్నారు. ఆనాటి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరాచకం సృష్టించిందన్నారు. వాటన్నిం టినీ గాడిన పెడుతూ అభివృద్ధి, సంక్షేమం చేపడుతున్నామన్నారు. ఎక్కడ తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు.పేదవారి కోసం ఇందిరమ్మ ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తోందన్నారు. ఇచ్చిన ప్రతి మాటను..హామీని ఆలస్యమైనా నిలబెట్టుకుంటామని మంత్రి పొంగులేటి తెలిపారు.

## ఏప్రిల్ నుంచి బిల్లులు చెల్లిస్తాం

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో పెండింగ్ బిల్లుల కోసం ఉద్యోగులు తిరగాల్సిన పనిలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఏప్రిల్ నుంచి ఉద్యోగులను పెండింగ్ బిల్లులను ప్రాధాన్యతా క్రమంలో చెల్లిస్తామని చెప్పారు. నెలకు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు విడుదల చేస్తామని వివరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ నేతలతో భట్టి విక్రమార్క సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన రూ.పదివేల కోట్ల బకాయిలను చెల్లించామని అన్నారు. దశాబ్దాలుగా పనిచేసిన ఉద్యోగులు దాచుకున్న డబ్బు కోసం పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను అర్థం చేసుకుని ఒక నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన రూ.ఐదు వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో ఉంచిందని వివరించారు. గత 14 నెలల కాలంలో కొంత బకాయిలు జమ అయ్యాయని చెప్పారు. పాత, కొత్త పెండింగ్ బిల్లులు రూ.10 వేల కోట్లు తమ ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. మరో రూ.ఎనిమిది వేల కోట్ల బకాయిలు మిగిలి ఉన్నాయని అన్నారు. ఏప్రిల్ నుంచి ఎలాంటి బకాయిల్లేకుండా చూస్తామని చెప్పారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న రూ.ఎనిమిది వేల కోట్ల పాత బకాయిలను రానున్న ఏప్రిల్ నుంచి ప్రాధాన్యతా క్రమంలో ప్రతినెల రూ.500 కోట్ల నుంచి రూ.600కోట్ల వరకు విడుదల చేస్తామ న్నారు. గత పదేండ్లు పాలించిన వారి సమయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు నెలలో ఏ తేదీలో జీతాలు పడతాయో అర్థం కాని పరిస్థితి ఉండేదని వివరించారు.

## 12 నుంచి అసెంబ్లీ

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ఈనెల 12 నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేరిట అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. 12న ఉదయం 11 గంటలకు శాసనసభ, మండలి కొలువుదీరనున్నాయి. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. ఈ సమావేశాల్లోనే బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా బిల్లులపై సమగ్రంగా చర్చించి, వాటికి చట్టబద్ధత కల్పించనున్నారని సమాచారం. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్లి ఈ రెండింటినీ పార్లమెంటులో కూడా ఆమోదించాలంటూ ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేయనుంది. అయితే సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై ఈనెల 13న జరిగే సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## నేడు ఆల్ పార్టీ మీటింగ్

**బలగం టీవి, హైదరాబాద్**

కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలపై చర్చించనున్నట్టు సమాచారం. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అందుకు సంబంధించిన ముసాయిదా బిల్లుకు గురువారం నాటి క్యాబినెట్‌లో ఆమోదముద్ర పడిన విషయం తెలిసిందే. త్వరలో జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లుకు ఆమోదం తెలిపి కేంద్రానికి పంపించాలని సర్కార్ నిర్ణయించింది. రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంట్‌లో ఒత్తిడి తేవాలనే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహించనుంది. ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఎంపీలందరికి డిప్యూటీ సీఎం స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు.

## రాజన్న జిల్లా కొత్త పోలీస్ బాస్‌గా గితే మహేష్ బాబా సాహెబ్..



**బలగం టీవీ , సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన ఎస్పీగా గితే మహేష్ బాబా సాహెబ్ ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గితే మహేష్ బాబా సాహెబ్ ములుగు ఓఎస్డి గా విధులు నిర్వహిస్తున్నారు. 2020ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గితే మహేష్ బాబా సాహెబ్ రాజన్న సిరిసిల్ల పోలీస్ బాస్‌గా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు.



## సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతన్న...

**బలగం టీవీ,, గంభీరావుపేట**

పెద్ద కాల్వ ఆయకట్టుకు ఎగువ మానేరు నీటిని అందించి వరి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు..రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని సిద్దిపేట కామారెడ్డి ప్రధాన రహదారిపై శుక్రవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు.రైతులు నిర్వహిస్తున్న రాస్తారోకో బిజెపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సింగసముద్రం నాలా ( పెద్ద కాల్వ) ఆయకట్టు సుమారు పదివేల ఎకరా వరకు ఉంటుందని, ప్రస్తుతం 100 ఎకరాకూడా సాగునీరు అందడం లేదని, సాగునీరు అందక వరి పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద కాలువలను నమ్ముకొని వరి పంట సాగు చేసామని, వేలకు వేలు పంటకు పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు సాగునీరు అందక ఎండుతున్నాయని అన్నారు. ఎగువ మానేరులో నీరు ఉండి కూడా విడుదల చేయడం లేదు అని అన్నారు. ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఎండుతున్న పంట పొలాలకు సాగునీరు అందించి ఆదుకోవాలని అన్నారు. నీటిని విడుదల చేయడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సంఘటన స్థలానికి ఎస్సై శ్రీకాంత్ ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని నచ్చజెప్పి రాస్తారోకోను విరమింప చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంటా అశోక్, నాయకులు ప్రసాద్ రెడ్డి, దేవసాని కృష్ణ, పత్తి స్వామి, రాజు, రైతులు చిట్టంపల్లి రాజు, టేకుమల్ల గంధపు రాజు, వేశాల రామచంద్రం, వేశాల రమేష్ , చిట్టెంపల్లి అడువయ్య, చిట్టెంపెల్లి స్వామి, బాలయ్య దేవయ్య తదితరులు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా మహిళా దినోత్సవం...

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోనిఎంపీపీఎస్ వెంకంపేట పాఠశాలలో ఉమెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోర దామోదర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర,మహిళలు కుటుంబ నిర్వహణ నుండి అంతరిక్షంలో పరిశోధన వరకు తమ గొప్పతనాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు.అనంతరం పాఠశాల మహిళ ఉపాధ్యాయినీలను ఘనంగా సన్మానించి, మేముంటోను బహుకరించారు.

## కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు..

**బలగం టీవీ , సిరిసిల్ల**



కరాటే పోటీల్లో పెద్దూరు పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. కరాటే లో మంచి ప్రతిభ కనబరిచి గోల్డ్ ,సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థులు బి లిఖిత, ఎస్ లాస్య ప్రియ, ఎం ప్రణీత ,బి వెన్నెల ,సిహెచ్ హేమ, టీ తన్విత ,ఎస్ మేఘన, బి దాక్షిణ్య లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తులు రమాదేవి, కరాటే మాస్టర్ సమ్మయ్య, మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.

### సామాజిక ఫించన్‌లను

# రుణాల కింద జమ చేస్తే క్రిమినల్ చర్యలు

**ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలి..**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**



ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని, రైతుల రుణాలకు రైతు భరోసా నిధులను కొన్ని బ్యాంకులు ఆపుతున్నాయని, ఈ ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలని ప్రభుత్వం అందించే సహాయాన్ని రైతులకు తప్పనిసరిగా అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ బ్యాంకర్లను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత డీసీసీ/డీఎల్ఆర్సి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే సామాజిక పింఛన్లను కొన్ని బ్యాంకులు వివిధ రుణాల కింద జమ్మ చేసుకుంటున్నట్లు సమాచారం అందుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం అందించే పథకాలు సొమ్మును రుణాల కింద జమ చేసుకోవడానికి వీలు లేదని, వెంటనే సంబంధిత లబ్దిదారులకు ఆ సొమ్మును చేర వేయాలని, లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేసే బ్యాంకుల పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గత సమావేశంలో జిల్లాలో 3 కొత్త బ్యాంకులో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని, ప్రస్తుతం చందుర్తి మండలం మల్యాల గ్రామంలో యూ.బి.ఐ బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయని, రుద్రాంగి మండలం, కొనరావుపేట మండలంలో కూడా బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారుజిల్లాలోని రైతులకు పంట రుణాల క్రింద 1,519 కోట్లు పంపిణీ చేయడం లక్ష్యం కాగా డిసెంబర్ చివరి నాటికి 808 కోట్ల పంపిణీ చేశామని, పెండింగ్ లక్ష్యాన్ని చివరి క్వార్టర్ లో యాసంగి పంటకు పూర్తి చేసేందుకు కృషి చేయాలని అన్నారు.

వ్యవసాయ టర్మ్ రుణాల కింద 421 కోట్ల రూపాయల రుణ పంపిణీ లక్ష్యానికి గాను 405 కోట్ల 92 లక్షల రుణాలను డిసెంబర్ నాటిక పూర్తి చేయడాన్ని అభినందించారు. స్వశక్తి సంఘాలకు నిర్దేశించుకున్న లక్ష్యంలో 93 శాతం పూర్తి చేసామని, పెండింగ్ లక్ష్యాన్ని మార్చి నెలాఖరు నాటికి చేరుకోవాలని అన్నారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు వివిధ పథకాల క్రింద యువతకు రుణాలు అందించాలని, యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని , ఈ పథకాల పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు.

పి.ఎం.ఎఫ్.ఎం.ఈ ను వినియోగిస్తూ ఇందిరా మహిళా శక్తి ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, పెండింగ్లో ఉన్న దరఖాస్తుల పై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం విశ్వకర్మ కింద సిరిసిల్ల జిల్లా 53 మంది యూనిట్లకు రుణాల పంపిణీ పూర్తి చేసామని, మరో 355 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని వీటిని పరిశీలించే అర్హులకు పీఎం విశ్వకర్మ రుణాలు అందించాలని తెలిపారు.

పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ పరిధిలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులకు రుణాలు పంపిణీ చేపట్టాలని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ క్రింద 619 మందు యూనిట్లకు 2 పాడి పశువుల పంపిణీ కోసం సబ్సిడీ విడుదల చేయడం జరిగిందని, పెండింగ్ యూనిట్లను త్వరగా గ్రౌండ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వ్యవసాయ మార్కెటింగ్ ఇన్ ఫ్రా, ఎఫ్.పి.ఓ , పశుసంవర్ధక వసతుల కల్పన క్రింద కేంద్ర ప్రభుత్వం నాబార్డ్ ద్వారా అమలు చేసే సబ్సిడీ పథకాలపై అవగాహన కల్పిస్తూ అవసరమైన వారు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ టి.ఎన్.మల్లిఖార్జున్ రావు , యూ.బి.ఐ రీజనల్ హెడ్ అపర్ణ రెడ్డి, ఆర్.బి.ఐ ఎల్.డి.ఓ వి. సాయి తేజ్ రెడ్డి, వివిధ శాఖల బ్యాంక్ కంట్రోలర్స్ ,మేనేజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణలు అందజేయాలి..

**-నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా పక్కా కార్యాచరణ అమలు చేయాలి..**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా పక్కా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.శుక్రవారం జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ జిల్లా స్థాయి స్కిల్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ జిల్లాలో కలెక్టర్ చైర్మన్ గా 16 మంది సభ్యులతో జిల్లా స్థాయి స్కిల్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి లభించేందుకు అవసరమైన నైపుణ్యత, శిక్షణ అందించేందుకు జిల్లా స్థాయి స్కిల్ కమిటీ పని చేస్తుందని అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 20% జనాభా తయారీ, సర్వీస్ సెక్టార్ లో ఉపాధి పొందుతున్నారని,చిన్న పరిశ్రమల స్థాపన, స్టార్ట్ అప్ కల్చర్, స్టాండప్ ఇండియా స్టార్ట్ అప్ ఇండియా వంటి వాటి పై అవగాహన కల్పన కార్యక్రమాలను జిల్లాస్థాయి స్కిల్ కమిటీ ద్వారా చేపట్టాలని తెలిపారు. ఉపాధి అవకాశాలు సృష్టించేలా యువతను తయారు చేయాలని అన్నారు.ఇండియన్ ఎయిర్ ఫోర్స్, కేంద్ర ప్రభుత్వ రంగం,ఆర్మీ, బ్యాంకు రిక్రూట్మెంట్ సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు యువతకు తెలియజేస్తూ వారు ఉపాధి అవకాశాలు పొందేలా అవసరమైన శిక్షణ అందించేందుకు కార్యాచరణ అమలు చేయాలని పేర్కొన్నారు.

ప్రతి ప్రభుత్వ కార్యాలయం, మున్సిపల్ భవనంలో ఆర్మీ నేవీ సంబంధించి ఉద్యోగాల భర్తీ వివరాలు నోటీసు బోర్డు లలో ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో ఎలక్ట్రీషియన్ కొరత కూడా ఉందని, ఈ రంగంలో కూడా శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. భవన నిర్మాణ పనులకు సంబంధించి న్యాక్ ద్వారా శిక్షణ అందించాలని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ ద్వారా గార్డెనింగ్, హార్టికల్చర్ లో శిక్షణ అందించాలని అన్నారు. దేశంలోనే పెద్ద కంపెనీల యొక్క ప్రస్తుత డిమాండ్ ప్రకారం మన యువతకు నైపుణ్యత ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

టీ వర్క్స్ తో సమన్వయం చేసుకుంటూ యువతుకు అవసరమైన అవకాశాలు అందులో చూడాలని కలెక్టర్ తెలిపారు. టాటా వంటి సంస్థలతో సమన్వయం చేసుకుంటూ వర్క్ షాప్ లను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రధానమంత్రి సూర్య రష్మీ యోజన పథకం స్వశక్తి మహిళా సంఘాలు, మెప్మా సంఘాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని, వీరికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సోలార్ ప్యానల్స్ తయారి డిజైన్ వంటి వివిధ రకాల అవకాశాలను యువతకు అందేలా చూడాలని అన్నారు ఈ సమావేశంలో జిల్లా ఉపాది కల్పనాధికారి రాఘవేందర్, డి.ఆర్. డి.ఓ. శేషాద్రి, జీ.ఎం. డి.ఐ.సి. హన్మంతు, డి.ఏ.ఓ. అఫ్జలి బేగం, ఎల్.డి.ఎం మల్లికార్జున్ , ఎస్టి , బి.సి సంక్షేమ అధికారులు, జనార్దన్, రాజమనోహర్, లేబర్ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.